నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 18 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బెల్లంపల్లిరూరల్ : తాళ్లగురిజాల రైతు వేదిక వద్ద ఎదగని హరితహారం మొక్కలు

మంచిర్యాలటౌన్ : పట్టణంలోని ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు

చెన్నూర్ : బృహత్ పట్టణ ప్రకృతి వనంలో ఎండి పోయిన మొక్కలు

జైపూర్ : వెలవెల బోతున్న ఇందారం పల్లె ప్రకృతి వనం

మందమర్రిరూరల్ : అధ్వానంగా సండ్రోన్ పల్లె ప్రకృతి వనం

# నాడు పచ్చల హారం నేడు కళావిహీనం

## 'హరితహారం'పై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

● ఎక్కడికక్కడ ఎండిపోతున్న మొక్కలు ● కళావిహీనంగా పల్లె, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్కులు
● ఈ ఏడాది లక్ష్యాన్ని తగ్గించిన ప్రభుత్వం ● కేసీఆర్ సర్కారులో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు

*చెట్టంటే.. సమస్త జీవరాశికి 'ఆయువు'పట్టు.. ఆకై, కాయై, పండై ఆకలి తీర్చే కల్ప 'తరువు'.. కలకాలం చల్లని నీడై, తోడై, ప్రాణవాయువై కాపాడే వృక్షం.. వాతావరణ సమతౌల్యతను కాపాడే కాలుష్య నియంత్రిక.. అలాంటి చెట్టును రక్షించేందుకు కేసీఆర్ సర్కారు 'హరితహారం' ఉద్యమంలా చేపట్టగా, జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలందుకున్నది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద కార్యక్రమంగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అంతటి సత్ఫలితాలిచ్చిన కార్యక్రమం నేడు కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ప్రమాదంలో పడింది. నాడు.. పచ్చగా కళకళలాడిన ఊర్లు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లు, ఏకో పార్కులు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లు నేడు.. ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారాయి. మొక్కలు, చెట్లన్నీ ఎండిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువవ్వడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

సీసీసీ నస్పూర్ : పట్టణ ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు

**బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంచిర్యాల జిల్లాలో హరితహారం కింద నాటిన మొక్కలు**

| సంవత్సరం | నిర్దేశించిన లక్ష్యం | నాటిన మొక్కలు |
|---|---|---|
| 2015 | 46,67,000 | 47,23,010 |
| 2016 | 75,63,600 | 78,58,856 |
| 2017 | 95,00,000 | 97,20,239 |
| 2018 | 94,00,000 | 71,36,331 |
| 2019 | 1,40,80,000 | 90,03,584 |
| 2020 | 67,25,870 | 69,49,752 |
| 2021 | 40,28,000 | 57,59,782 |
| 2022 | 44,30,000 | 59,17,087 |
| 2023 | 45,21,600 | 25,00,400 |
| మొత్తం | 6,49,16,070 | 5,95,69,041 |

దహెగాం : ఆనవాళ్లు కోల్పోయిన మొట్లగూడ ప్రకృతి వనం

మంచిర్యాల, మే 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'తెలంగాణ పచ్చబడాలే.. చెట్లు లేక బోసిపోయిన పల్లెలు, పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియాలే.. పరాయి పాలనలో నిర్జీవంగా మారిన అడవులకు పునరుజ్జీవం పోయాలే.. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలపాలే..' అనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు హరితహారం కార్యక్రమం చేపట్టి కోట్లాది మొక్కలకు ప్రాణం పోసింది. వేల కోట్లు ఖర్చు పెట్టి పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌లు, ఏకో పార్కులు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం ఉట్టి పడేలా చర్యలు తీసుకున్నది. ఫలితంగా తెలంగాణలో అడవుల శాతం పెరిగింది. ఇంకో రెండు, మూడేళ్లు నాటిన మొక్కలను కాపాడుకుంటే అద్భుతమైన ఫలితాలు వస్తాయనుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హరితహారాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. అసలు ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో పచ్చదనం అనేది కనిపించకపోవడం గమనార్హం. కేసీఆర్ పాలనలో ఎక్కడ చూసినా కళకళలాడిన మొక్కలు.. నేడు ఎండిపోయి కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పచ్చదనానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, మున్సిపాలిటీ, ఫారెస్టు శాఖలు ఇప్పుడు అసలు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కొత్తవి పెట్టకపోగా.. ఉన్నవాటిని కూడా కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో 2015 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ సర్కారు హయాంలో 5.95 కోట్ల మొక్కలు నాటారు. ఇందులో గడిచిన ఏడాదే 45 లక్షలు మొక్కలని లక్ష్యం నిర్దేశించుకోగా.. ఈ ఏడాది మొక్కలు నాటే లక్ష్యాన్ని 31.20 లక్షలకు తగ్గించారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఇదే అతి తక్కువ టార్గెట్ కావడం గమనార్హం. బీఆర్ఎస్ హయాంలో హరితహారం కార్యక్రమానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండేదని, మొక్కలు ఎండిపోడానికి అవకాశమే లేకుండా మానిటరింగ్ ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేక ఎక్కడ చూసినా ఎండిపోయిన మొక్కలు, ఎడారీగా మారిన ప్రకృతి వనాలు దర్శనమిస్తున్నాయి.

మందమర్రిరూరల్ : అధ్వానంగాచిర్రకుంట బృహత్ పల్లెప్రకృతి వనం

జన్నారం : మొర్రిగూడ పల్లె పకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

### హరితహారంపై పట్టింపేది?

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా, కేసీఆర్ సర్కారు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేకంగా స్థలాలను కేటాయించి నర్సరీలను ఏర్పాటు చేసింది. యేటా ప్రతి గ్రామంలో 40 వేల మొక్కలు నాటించింది. వర్షాకాలం ప్రారంభంలోనే హరితహారం పండుగలా సాగేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరితహారం కార్యక్రమం కనుమరుగవుతోంది. వచ్చే వర్షాకాలం నాటికి హరితహారం కోసం నర్సరీల్లో సిద్ధం చేయాల్సిన మొక్కల పెంపకం గురించి అధికారులు పట్టించుకోవడం మానేశారు. సర్పంచులు లేకపోవడంతో గ్రామ పంచాయతీల పాలన ప్రత్యేకాధికారులకు అప్పగించడంతో నర్సరీల నిర్వహణ చూసేవారే కరువయ్యారు. అసలు జిల్లాలో హరితహారం కార్యక్రమం నిర్వహించే అవకాశం కనిపించడం లేదు.

కన్నెపల్లి : పిచ్చి మొక్కలతో నిండిపోయిన జన్నాపూర్‌లోని పల్లె ప్రకృతి వనం

భీమారం : కళ తప్పిన బృహత్ పల్లె ప్రకృతి వనం

కాసిపేట : నిర్వహణ లేక కళావిహీనంగా ముత్యంపల్లి పల్లె ప్రకృతి వనం

తాండూర్: నిర్వహణ లేక అధ్వానంగా పోచంపల్లి పల్లె ప్రకృతివనం

# వర్షార్పణం..

● ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పలుచోట్ల గాలివాన ● కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో తడిసిముద్దయిన ధాన్యం
● తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు ● కన్నేపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి బర్రె మృతి

కోటపల్లిలో కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయిన వరి ధాన్యాన్నిఎత్తుతున్న రైతులు

భీమారం : ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు

పెంచికల్‌పేట్ : ధాన్యం కుప్పల్లో చేరిన నీటిని తొలగిస్తున్న రైతులు

దండేపల్లి : ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బర్రె కళేబరం

కోటపల్లి/భీమారం/దండేపల్లి/బెజ్జూరు/పెంచికల్‌పేట్, మే 17 : కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కురిసిన గాలి వాన రైతన్నలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లోని ధాన్యం తడిసిముద్దయింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలకేంద్రంలోని పీసీసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి పెద్ద మొత్తంలో ధాన్యం రాగా, కొనుగోళ్లలో జాప్యం జరగడంతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటిపాలైంది. వరదకు వడ్లు కొట్టుకుపోయాయి. ఇక భీమారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షానికి వడ్లు నీటిపాలయ్యాయి. కొన్ని చోట్ల వరి నేలకొరిగింది. దండేపల్లి మండలం కన్నేపల్లికి చెందిన అక్కల మల్లేశ్‌కు చెందిన బర్రె మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్ తగిలి మృతి చెందింది. దీని విలువ రూ.30 వేల వరకు ఉంటుందని మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో గాలివాన బీభత్సం సృష్టించింది. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని తరలించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే తీవ్రంగా నష్టపోయామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెజ్జూరు : మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

## నేషనల్ వాటర్ అవార్డుకు కౌటాల జీపీ

కౌటాల, మే 17 : నేషనల్ వాటర్ అవార్డుకు కౌటాల జీపీకి చోటు దక్కిందని కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సీనియర్ సైంటిస్టు దివాకర్ హన్మంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీని జల వనరుల శాఖ సైంటిస్టు దివాకర్ హన్మంత్‌తో పాటు కేంద్ర జలవనరుల డివిజన్ ఇంజినీర్ సతీశ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, ఐఈసీ కోఆర్డినేటర్ మల్లేశ్ బృందం సభ్యులు సందర్శించారు. ఉపాధిహామీ ద్వారా పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ వాటర్ అవార్డు కోసం దేశ వ్యాప్తంగా మొత్తం 185 గ్రామ పంచాయతీలను కేంద్రం ఎంపిక చేసిందని తెలిపారు. ఇందులో టాప్ 25 జీపీల్లో తెలంగాణలోని 7 జీపీలను ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ ఏడింటిలో కౌటాల జీపీ ఒకటి కావడం జిల్లాకే గర్వకారణమని చెప్పారు. ఎంపీపీ విశ్వనాథ్, టీం సభ్యుడు పోశెట్టి, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఈజీఎస్ ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, వాటర్‌షెడ్ టీం అహ్మద్, కార్యదర్శిసాయి పాల్గొన్నారు.

కౌటాల జీపీలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం